## క్లుప్తంగా

### పోరాట యోధుడు పాపన్నగౌడ్



పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న గౌడసంఘం నాయకులు

**ఆమనగల్లు:** తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ప్రతీకగా నిలిచారని గౌడసంఘం నాయకులు అన్నారు. బహుజనుల కోసం పోరాడిన యోధుడు అని కొనియాడారు. పాపన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆమనగల్లు పట్టణంలోని శ్రీ కంఠ మహేశ్వర దేవాలయ ఆవరణలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన ఆశయసాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గౌడసంఘం కల్వకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు చుక్క అల్లాజీగౌడ్, ఉపాధ్యక్షుడు గంగారవిగౌడ్, పట్టణ అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్, యువజన సంఘం అధ్యక్షుడు నరేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి గజ్జె రాఘవేందర్‌గౌడ్, నాయకులు అల్లాజి, నర్సింహ, శివ, వెంకటేశ్, అంజి, సాయి, మనోజ్, సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### ఎంపీ మల్లు రవిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఎంపీతో కాంగ్రెస్ నాయకులు

**ఆమనగల్లు:** నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యుడు డాక్టర్ మల్లు రవిని ఢిల్లీలోని ఆయన నివాసంలో బుధవారం మార్కెట్ మాజీ చైర్మన్ గుర్రం కేశవులు, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు మండ్లిరాములు, నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనునాయక్, చందునాయక్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమనగల్లు మండల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీని కోరామని తెలిపారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించారని నేతలు పేర్కొన్నారు.

### 'భగీరథ' కార్మికుల సమస్యలు పరిష్కరించండి



ప్లాంట్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నేతలు

**యాచారం:** ప్రజల దాహార్తి తీర్చడం కోసం రాత్రి, పగలు కష్టపడుతున్న మిషన్ భగీరథ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ముచ్చర్లల్లోని భగీరథ ప్లాంట్ మేనేజర్ వంశీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మయ్య, నాయకులు పోచమోని కృష్ణ, చందునాయక్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

### పాస్టర్ మృతిపై విచారణ జరిపించండి



ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

**ఇబ్రహీంపట్నం:** పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై సీబీఐతో విచారణ జరిపించాలని పాస్టర్స్ నియోజకవర్గ అసోసియేషన్ అధ్యక్షుడు దినాకర్ డిమాండ్ చేశారు. పాస్టర్ మృతికి సంతాపంగా బుధవారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో శాంతిర్యాలి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత బోధకుడు మరణం సాధారణమైనది కాదని, ఇది ముమ్మాటికీ హత్యేనని ఆరోపించారు. ఆయన మృతిపై ఎలాంటి అనుమానాలకు తావులేకుండా సమగ్ర విచారణ జరిపించి, వాస్తవాలను వెల్లడించాలని కోరారు. కార్యక్రమంలో క్రిస్టియన్ అసోసియేషన్ కోఆర్డినేటర్ చెరుకూరి రాజు, కార్యదర్శి దేవకుమార్, పాస్టర్స్ ప్రకాశ్, కరుణాకర్, రవికుమార్, సంజీవ, క్రిస్టఫర్, అజయ్ కుమార్, జైరాజ్, జయకుమార్, సైమన్ పీటర్‌లు పాల్గొన్నారు.

# ఉక్కిరిబిక్కిరి

- భగ్గుమంటున్న సూర్యుడు
- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు.. ప్రజల ఆందోళన



ఎండలకు మంచాల మండల కార్యాలయం వద్ద నిర్మానుష్యంగా మారిన కూడలి

**మంచాల:** పెరుగుతున్న ఎండలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఓ వైపు ఉక్కపోత, మరోవైపు వడగాలులతో సతమతమవుతున్నారు. బయటకు వెళ్లాలంటే ఆందోళన చెందుతున్నారు. సూర్యుడు భగభగలతో ఉదయం 11 గంటలకే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. గత ఏడాది కంటే ఈ ఏడు భానుడు ప్రభావం అధికంగా ఉండబోతుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే.. మునుముందు ఎలా ఉండబోతుందోనని పేర్కొంటున్నారు. సాధారణంగా ఎండలు శివరాత్రి అనంతరం ఎక్కువగా ఉండాలి. కానీ ఈ సారి ఫిబ్రవరి నుంచే ఎండల తీవ్రత పెరిగింది. ప్రస్తుతం ఏప్రిల్ మాసం కావడంతో ఎండలు మరింత ముదిరే అవకాశం ఉంది. గడిచిన వారం రోజులుగా ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. దానికి తోడు వడ గాలులు వీస్తున్నాయి. దీంతో ప్రజలు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు ఇంటి నుంచి బయటకు రాలేక పోతున్నారు.

**బయట తిరగవద్దు**



పెరుగుతున్న ఎండల తీవ్రతకు ప్రజలు బయట తిరగొద్దు. కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. లూజుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి. తప్పని సరిగా బయటకు వెళ్లాల్సి వస్తే.. గొడుగు, లేదా టోపీలు వాడాలి. డీహైడ్రేషన్‌కు గురి గాకుండా జాగ్రతలు పాటించాలి. చల్లని పానియాలు, జంక్‌ఫుడ్ తీసుకోకూడదు.

– డాక్టర్ దీప్తి, ఆరుట్ల ప్రాథమిక వైద్యశాల

# మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

- అతివల చైతన్యంతోనే అది సాధ్యం
- ఎస్‌ఐ వరప్రసాద్



మాట్లాడుతున్న ఎస్‌ఐ వరప్రసాద్

**కడ్తాల్:** మహిళల చైతన్యంతో మానవ అక్రమ రవాణాను నిర్మూలించవచ్చని ఎస్‌ఐ వరప్రసాద్ అన్నారు. మండల కేంద్రం మహిళా సమాఖ్య కార్యాలయంలో.. ఏపీఎం రాజేశ్వరి అధ్యక్షతన, అక్రమ రవాణా నిర్మూళనకు.. సంఘం అధ్యక్షులు, వీఓఏలకు బుధవారం ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడారు. మహిళా చట్టాలు, లైంగిక దాడి, శ్రమ దోపిడీ, అవయవాల మార్పిడి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలను ఇతరులకు చెప్పవద్దని సూచించారు. సెల్ ఫోన్‌లలో తెలియని యాప్‌లను ఓపెన్ చేయవద్దని, ఏమైనా సమస్యలు ఉంటే 100కు కాల్ చేయాలని చెప్పారు. అనంతరం ఏపీఎం మాట్లాడుతూ.. శిక్షణ అనంతరం గ్రామాల్లో మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించి, సంఘం సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సీసీలు వసంత, జరీనా, రాములు, నర్సింహ, వీఓఏలు లావణ్య, అనసూయ, సుధ, జంగయ్య, కృష్ణవేణి, బాలరాజ్ తదితరులు ఉన్నారు.

# బియ్యం పంపిణీలో కేంద్రం వాటా అధికం



ఇబ్రహీంపట్నం: రేషన్ దుకాణాల వద్ద సన్న బియ్యం పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు



తలకొండపల్లి: చంద్రధనలో బియ్యం పంపిణీని పరిశీలిస్తున్న నాయకులు

- పది శాతమే రాష్ట్ర ప్రభుత్వానిది
- బీజేపీ నాయకులు
- రేషన్ కార్డులపై మోదీ ఫొటో ముద్రించాలని డిమాండ్

**ఇబ్రహీంపట్నం:** పేద ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే ఉచిత సన్న బియ్యం పంపిణీలో కేంద్ర ప్రభుత్వం వాటానే అధికంగా ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ కౌన్సిలర్ ముత్యాల భాస్కర్ అన్నారు. కేంద్రం వాటా 90 శాతం, 10 శాతం రాష్ట్ర ప్రభుత్వానిదని పేర్కొన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మహేందర్ ఆధ్వర్యంలో బుధవారం ఇబ్రహీంపట్నంలోని వివిధ రేషన్ దుకాణాల వద్ద బియ్యం పంపిణీని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం.. అందులో వాటా ఎంతో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఓటు బ్యాంకు రాజకీయాలు మానుకొని, రేషన్‌కార్డులపై అధికారికంగా మోదీ చిత్రాన్ని ముద్రించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం పార్టీ పట్టణ అధ్యక్షుడు మాట్లాడుతూ.. పేదవారు కూడా సన్నబియ్యం బువ్వ తినాలన్న లక్ష్యంతో 'ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన' పథకాన్ని బీజేపీ తీసుకువచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సూరంపల్లి కాళిదాస్, ఎస్ దాసు, సంతోష్, శశిధర్‌రెడ్డి, రాజు, శివ, గోపి, సురేష్, సాయిరామ్, భరత్‌లు పాల్గొన్నారు.

**తలకొండపల్లిలో..**

**తలకొండపల్లి:** పేద ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే ఉచిత సన్న బియ్యం పంపిణీలో కేంద్ర ప్రభుత్వం వాటనే అధికంగా ఉందని బీజేపీ జిల్లా నాయకుడు, మాజీ సర్పంచ్ బక్కి కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధి చంద్రధనలో ఆయన సన్న బియ్యం పంపిణీని పరిశీలించి మాట్లాడారు. కేంద్రం రూ.10 వేల కోట్లు సన్నబియ్యం సేకరణకు కేటాయిస్తుందని తెలిపారు. ప్రస్తుతం పంపిణీ చేసే సన్నబియ్యంలో ఖర్చు చేస్తున్న రూ.50లో సుమారు రూ.40లు కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అన్ని రేషన్‌షాపుల్లో ప్రధాన మోదీ ఫొటో పెట్టాలని డిమాండ్ చేశారు.

**ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం**

ఉచిత బియ్యం పంపిణీలో కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం తెలంగాణకు రూ.10 వేల కోట్లు కేటాయిస్తుందని బీజేపీ నాయకులు తెలిపారు. ఉచిత సన్నబియ్యం పంపిణీ నేపథ్యంలో మండల కేంద్రంలో ప్రధాని చిత్రపటానికి పార్టీ శ్రేణులు క్షీరాభిషేకం చేశారు. అన్ని రేషన్ షాపుల్లో ప్రధాని ఫొటో పెట్టాలని డిమాండ్‌చేశారు. పార్టీ జిల్లా నాయకులు శానమోని పాండు ప్రసాద్, పాండు, మాజీ ఉప సర్పంచ్ అనీల్, దుగ్గాపురం కుమార్, బాలకృష్ణ, శాంతకుమారి, యాదయ్య పాల్గొన్నారు.

### 'రాజీవ్ యువ వికాసానికి' దరఖాస్తు చేసుకోండి

**ఆమనగల్లు:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'రాజీవ్ యువ వికాసం' పథకం కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు ముగింపు గడువు ఈ నెల 14 వరకు పొడిగించిందన్నారు. అర్హులు మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో అందించాలని తెలిపారు. పథకంపై సందేహాల నివృత్తికోసం పుర కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామన్నారు.

**గడువు పెంపు**

**ఇబ్రహీంపట్నం:** రాజీవ్ యువ వికాస పథకానికి ఈ నెల 14 వరకు ప్రభుత్వం గడువు పెంచిందని ఎంపీడీఓ వెంకటమ్మ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. అర్హత గల నిరుద్యోగ యువతీయువకులు నేరుగా మండల పరిషత్ కార్యాలయంలో లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### రక్షణ కల్పించాలని డీసీపీకి వినతి

**కేశంపేట:** ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్‌తో పాటు అతడి అనుచరుల నుంచి తనకు ప్రమాదం ఉందని, రక్షణ కల్పించాలని మండల పరిధిలోని కాకునూర్ గ్రామానికి చెందిన సొంటె శ్రీనివాస్ శంషాబాద్ డీసీపీకి బుధవారం ఫిర్యాదు చేశారు. గతంలో డీఎస్పీలో విశారదన్‌తో కలిసి పార్టీలో పని చేసినట్టు ఆయన ఫిర్యాదులో తెలిపారు. ఆ సమయంలోనే విశారదన్ విధానపరమైన తప్పులను, ఉద్యమం మాటున అతను చేస్తున్న ఆర్థికపరమైన అవకతవకల విషయంలో ఇద్దరికి విబేధాలు వచ్చాయన్నారు. ఇటీవల కాలంలో కొన్ని మీడియా ఛానల్స్‌కు ఇంటర్వ్యూలు ఇస్తున్న సందర్భంలో విశారదన్‌కు సంబంధించిన అనేక విషయాలను ప్రజలకు తెలిపానన్నారు. దీంతో విశారదన్ తన అనుచరులతో తనపై భౌతిక దాడులు చేస్తామని బంధువులు, స్నేహితులకు ఫోన్లు చేసి పరోక్షంగా బెదిరింపులకు పాల్పడుతున్నట్టు పేర్కొన్నారు. విశారదన్‌తో పాటు అతడి అనుచరుల నుంచి తనకు ప్రమాదం ఉందని రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

# హెచ్‌సీయూ భూముల వేలం ఆపండి



కడ్తాల్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ, బీజేవైఎం నాయకులు

- బీజేవైఎం, బీజేపీ, సీపీఎం నాయకుల డిమాండ్
- విద్యార్థి, పార్టీల శ్రేణుల అరెస్టులకు నిరసనగా ధర్నాలు

**ఇబ్రహీంపట్నం/ కడ్తాల్:** హైదరాబాద్ సెంట్రల్ యూనిర్సిటీ (హెచ్‌సీయూ) భూముల వేలం నిలిపివేయాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి భగీరథ్ డిమాండ్ చేశారు. బుధవారం బీజేపీ, బీజేవైఎం నాయకులతో కలిసి ఆయన కడ్తాల్ తహసీల్దార్ ముంజాత్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం భగీరథ్ మాట్లాడుతూ.. హెచ్‌సీయూ భూములు సర్కారువేనంటూ రాష్ట్ర ప్రభుత్వం.. భారీ యంత్రాలతో అటవీ భూమిని చదును చేసి విక్రయించేందుకు సిద్ధపడిందని ఆరోపించారు. ఈ కుట్రతో విలువైన భూమి కోల్పోవడమే కాకుండా.. మూగజీవాల ఉనికి ప్రశ్నార్థకంగా మారనుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఇదే విషయమై న్యాయపోరాటం చేస్తున్న బీజేపీ, బీజేవైఎం శ్రేణులు, విద్యార్థులపై విచక్షణా రహితంగా పోలీసులతో లాఠీచార్జి చేయిస్తూ.. కేసులు నమోదు చేస్తుందని పేర్కొన్నారు. ఇది మంచిది కాదని, వెంటనే ఆ భూముల వేలాన్ని ఆపాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మహేశ్ దోనాదుల, గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిలాల్, నాయకులు శ్రీశైలంగౌడ్, మాన్యనాయక్, వెంకటేశ్, రాందాస్‌నాయక్, శంకర్‌నాయక్, సురేశ్, మధు, కల్యాణ్ నరేశ్‌గౌడ్, శ్రీకాంత్ ఉన్నారు.

**పోల్కంపల్లిలో..**

**ఇబ్రహీంపట్నం రూరల్:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను కాపాడాలని సీపీఎం పార్టీ పోల్కంపల్లి గ్రామశాఖ డిమాండ్ చేసింది. ఆందోళన చేస్తున్న విద్యార్థులు, నాయకులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించింది. బుధవారం ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లిలో ఆ పార్టీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. హెచ్‌సీయూ 400 ఎకరాల భూమిని వేలం వేయొద్దని కోరారు. శాఖ కార్యదర్శులు పి.స్వామి, పి.యాదయ్య, నర్సింహ, కరుణాకర్‌రెడ్డి, ఇస్తారి, బాలయ్య, శ్రీనివాస్, యాదయ్య, పాండు, దనంజీ, సీహెచ్ యాదయ్య, శివ పాల్గొన్నారు.

**యాచారంలో..**

**యాచారం:** హెచ్‌సీయూలో అక్రమ అరెస్టులకు నిరసనగా యాచారం సాగర్‌రోడ్డుపై సీపీఎం శ్రేణులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. హెచ్‌సీయూ భూములను వేలం వేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అటవీ ప్రాంతాన్ని చదును చేస్తూ.. వన్యప్రాణులకు రక్షణ లేకుండా చేస్తుందని ఆరోపించారు. భూముల వేలాన్ని ఆపాలని ఆందోళన చేస్తున్న విద్యార్థులను, సీపీఎం శ్రేణులపై దాడులు, అక్రమ అరెస్టులు చేయిస్తూ.. భయాందోళనకు గురి చేస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వం.. తీరు మార్చుకోకపోతే పోరాటం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పి.అంజయ్య, పి.బ్రహ్మయ్య, చందునాయక్, వినోద్‌కుమార్, రమేష్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఇబ్రహీంపట్నంలో..**

హెచ్‌సీయూ భూములను పరిరక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బోడ సామెల్ డిమాండ్ చేశారు. భూములను కాపాడాలని కోరుతూ.. నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వ భూములకు రక్షణ కరువైయిందని ఆందోళన వ్యక్తం చేశారు. హెచ్‌సీయూలోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని కార్పొరేట్ శక్తులకు విక్రయించాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. ప్రకృతిని, వన్యప్రాణుల సంరక్షణకు పోరాడుతున్న విద్యార్థులపై లాఠీచార్జి చేయడమే కాకుండా, అక్రమంగా కేసులు పెడుతున్నారని పేర్కొన్నారు. ఆ భూములను విక్రయించాలని చూస్తే.. రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సీహెచ్ జంగయ్య, జగన్, వెంకటేశ్, ఎల్లేష్, శ్రీకాంత్, శివ, వినయ్, నర్సింహులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నంలో.. సీపీఎం నేతలు



యాచారం: నిరసన తెలుపుతున్న సీపీఎం శ్రేణులు

# నీటి సమస్య రాకుండా చూడాలి

**ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

**యాచారం:** వేసవి నేపథ్యంలో ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం తాగునీటి ఎద్దడి, ఈజీఎస్ పనులు, అభివృద్ధి పనుల్లో వేగవంతంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి సమస్య రాకుండా.. మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా అవుతున్నాయా లేదో పర్యవేక్షించాలని చెప్పారు. సరఫరా లేని పక్షంలో ప్రత్యామ్యాయంగా సమస్యను తీర్చాలని సూచించారు. ఈజీఎస్ పనులను వేగవంతం చేయాలని, జాబ్ కార్డులున్న వారు ఉపాధి పనులకు వచ్చేలా కృషి చేయాలని చెప్పారు. నిబంధనల ప్రకారం పనులు చేస్తేనే కూలీ గిట్టుబాటు అవుతుందనే విధంగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగవంతం పెంచాలని, పనుల్లో నాణ్యత ఉండాలని తెలిపారు. విధుల్లో ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి శ్రీలత, ఈజీఎస్ ఏపీఓ లింగయ్య, ఈసీ శివశంకర్ రెడ్డిలు, వివిధ గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

# అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల అర్హులు, నాయకులు

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా..
- వినతిపత్రం అందజేత

**మంచాల:** గుర్తించిన అర్హులకు డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి రావుల జంగయ్య డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట అర్హుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఎంవీ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లింగంపల్లి గేట్ సమీపంలో డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి సంవత్సరాలు గడిచాయని, అయినా అర్హులకు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. గతంలో గుర్తించిన వారికి వెంటనే ప్రభుత్వం ఇళ్లు ఇవ్వాలని కోరారు. ఇళ్లు ఇచ్చేంతవరకు అర్హుల తరఫున పోరాటం చేస్తామని నేతలు స్పష్టం చేశారు. దీనికి స్పందించిన తహసీల్దార్.. వారం రోజుల వ్యవధిలో ఇళ్ల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు మార బుగ్గరాములు, బాలరాజు, ఎమ్మార్పీఎస్ మండల నాయకుడు సుధాకర్, నాగరాజు పాల్గొన్నారు.

### ఆధ్యాత్మికతతో ప్రశాంతత

**చేవెళ్ల:** ఆధ్యాత్మిక చింతన ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని అర్చకుడు వాసుదేవాచార్యులు అన్నారు. మున్సిపాలిటీలోని హనుమాన్ దేవాలయంలో బుధవారం చేవెళ్లకు చెందిన హనుమాన్ భక్తులు హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ మాలలు ధరించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హనుమాన్ దీక్షతో ఏకాగ్రత సిద్ధిస్తోందని, నిత్య పూజలతో భగవంతుడి అనుగ్రహం పొందుతారన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవాటు చేసుకోవాలని సూచించారు. హనుమాన్ దీక్ష తీసుకోవటం మంచి పరిణామమన్నారు. రాఘవేందర్, జగదీశ్వర్‌రెడ్డి, విశ్వరూపచారి, చంద్రశేఖర్ ఉన్నారు.

# బ్రహ్మోత్సవాలకు వేళాయె

- 5 నుంచి మైసిగండిలో ఉత్సవాలు
- 6న సీతారాముల కల్యాణం
- ముమ్మరంగా ఏర్పాట్లు



మైసిగండి రామాలయం



ఆలయ ప్రాంగణంలో కోనేరు

**కడ్తాల్:** మైసిగండి మైసమ్మ శివాలయ రామాలయాలలో కొలువైన శ్రీ కోదండరామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్నాయి. ఏటా శ్రీరామనవమిని పురస్కరించుకుని నిర్వహించే వేడుకలు.. ఈ నెల 5వ తేదీ నుంచి 7 వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈఓ స్నేహలత, ఆలయ ఫౌండర్ ట్రస్టీ శిరోలి తెలిపారు.

**ఆలయ చరిత్ర**

కడ్తాల్ మండలం మైసిగండిలో నెలకొన్న శివాలయ రామాలయ దేవాలయాలు.. ఋగ్వేద కాలంలో గంగా గుళ్లుగా పిలువబడేవి. శతాబ్దాల చరిత్ర కలిగిన ఆలయాలు గోల్కొండ నవాబుల కాలంలో అక్కన్న, మాదన్నలు మహామంత్రులుగా ఉన్నప్పుడు నిత్య పూజలు జరిగేవని పూర్వీకులు పేర్కొంటున్నారు. అలాంటి ఆలయాన్ని దాతలు, ప్రభుత్వ సహకారంతో 25 ఏళ్ల క్రితం సర్వాంగ సుందరంగా పునఃనిర్మాణం చేశారు. నేడు భక్తుల తాకిడితో దేదీప్యమానంగా వెలుగొందుతోంది. ఆలయ పరిసరాల్లోని కోనేరు గంగలో పవిత్ర స్నానాలు ఆచరిస్తే రోగాలు, పాపాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం.

**ప్రత్యేకత**

ఏటా శ్రీరామనవమిని పురస్కరించుకొని ఆలయంలో కొన్నేళ్లుగా కల్యాణ మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. 6న నిర్వహించే కోదండ రామచంద్ర స్వామి కల్యాణానికి దేవాదాయ, ధర్మాదాయ శాఖ ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను ఆనవాయితీగా సమర్పిస్తుంటుంది. ఇదిలా ఉండగా.. నగరం నుంచి 44 కిలో మీటర్ల దూరంలో ఉన్న మైసిగండి ఆలయానికి ప్రతి 5 నిమిషాలకు ఒకటి కల్వకుర్తి, హైదరాబాద్ నుంచి బస్సు సౌకర్యం కలదు.



కొలువైన శ్రీ కోదండ రామచంద్ర స్వామివారు

**ఉత్సవ కార్యక్రమాలు**

5న విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, అఖండ జ్యోతి స్థాపన, ధ్వజారోహణం, హోమశాల ప్రవేశం, నిత్యహోమ కార్యక్రమాలు. 6న మధ్యాహ్నం సీతారాముల పరిణయ మహోత్సవం, సాయంత్రం స్వామివారి రథోత్సవం. 7న చక్రతీర్థం, పుష్కరస్నానం, పూర్ణాహుతి, తీర్థప్రసాదాలు, వినియోగం కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయి.